క్లుప్తంగా

13న రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు: మండలంలోని ఉప్పుగూడెం గ్రామంలో ఈనెల 13న ఉదయం కోదండ సీతారామవిగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని, అనంతరం అన్న మహాసమారాధన నిర్వహిస్తామని సోమవరప్పాడు సిద్ధాంతి ఎస్ఎస్వి శాస్త్రి, ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఉప్పు గూడెం ఆలయం యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఉపాధి హామీ ద్వారా నీటి తొట్టెల నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

ఉంగుటూరు: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పశువులు నీటికి అవసరమయ్యే తొట్టెల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని ప్రజలకు మంచినీటి సమస్య ఏర్పడినా వెంటనే స్పందించాలని స్పష్టం చేశారు. ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, పారిశుద్ధ్య పరిస్థితి మెరుగుపరచాలని అన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివిధ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ చంద్రశేఖర్ తదితరలు పాల్గొన్నారు.

15 లోపు పశుగణన పూర్తి చేయాలి

దెందులూరు: పశుగణన ఈనెల 15నాటికి పూర్తి చేయాలని దెందులూరు మండల పశువైద్యాధికారి డా.రామ్మోహనరావు అన్నారు. బుధవారం కొవ్వలి పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని సిబ్బంది వేగవంతం చేయాలన్నారు. నిబంధనలు అనుగుణంగా లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. పశుగణన కార్యక్రమాన్ని జిల్లా అధికారులు పరిశీలిస్తారని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదవేగి : మండలంలో రాయుడుపాలెం పరిసర ప్రాంత ప్రజలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. పెదవేగి మండలం, విజయరాయి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ రాయుడు పాలెం సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కెవి, బాపిరాజుగూడెం ఫీడర్ క్రొత్త బ్రేకర్ పెడుతున్న కారణంగా ఈనెల 10 గురువారం నాడు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తామని తెలిపారు.కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

నిరుద్యోగ యువతకు మూడు నెలల శిక్షణ

ఉంగుటూరు: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించడం కోసం పదో తరగతి ఆపై చదువుకుని ఖాళీగ ఉన్న వారికి వివిధ అంశాలపై ఉచిత శిక్షణ ఇస్తామని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, పురుషులకు హోటల్‌మేనేజ్‌మెంటు, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఈ శిక్షణపై ఆసక్తి ఉన్న యువత 11న ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత సర్టిఫికెట్ జిరాక్సులతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 80745 00710, 93928 19393 నంబర్లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

కల్యాణ మండపం ధ్వంసంపై కేసు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఎస్వీఆర్ కల్యాణ మండపం ధ్వంసంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. పట్టణ పరిధిలోని రామచంద్రాపురంలో పరిమి ధర్మరాజుకు ఎస్వీఆర్ కల్యాణ మండపంలో ఈ నెల 5వ తేదీ రాత్రి గుర్తుతెలియని 30 మంది వ్యక్తులు ప్రవేశించి సామగ్రిని చిందరవందర చేసి, బాత్ రూమ్ డోర్‌లు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. సదరు దృశ్యాలను సీసీ పుటేజీల్లో పరిశీలించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని కల్యాణ మండపం యజమాని ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెంలోని ఉప్పలమెట్టలోని గంటా అనురాధ ఇంట్లో ఫిబ్రవరి 27న బంగారు నల్ల పూసలు గొలుసు 2 కాసులు, బంగారు చెవి దుద్దులు అరకాసు చోరీకి గురైందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై జబీర్ తెలిపారు. ఓ మహిళపై అనుమానం ఉన్నట్టు అనురాధ ఫిర్యాదులో పేర్కొందన్నారు.

ఈదురుగాలులతో వర్షం

పోలవరం రూరల్: పోలవరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలి ప్రభావానికి మామిడి, జీడిమామిడి కాయలు రాలిపోయాయి. వరి, మొక్కజొన్న చేలు కూడా విరిగి నేలమట్టమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


బీమా.. ఏదీ ధీమా!

- పేరుకుపోతున్న పెండింగ్ క్లెయిమ్‌లు
- 2024 మార్చి తర్వాత అమల్లోకి రాని పథకం
- 13 నెలలుగా ఎదురుచూపులకే పరిమితం
- ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్భాటంగా ప్రకటన
- అధికారం చేపట్టి పది నెలలైనా అతీగతీ లేదు

దెందులూరు: సంక్షేమ పథకాల అమలును గాలికొదిలిన కూటమి సర్కారు..కనీసం బీమా పథకమైనా అమలు చేస్తే కాస్త భరోసా ఉంటుందని ప్రజలు అంటున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు వైఎస్సార్ బీమాను అమలు చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదోడికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయం అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నేరుగా బాధితుల ఇళ్ల వద్దకే వెళ్లి సీఎం సహాయ నిధి పరిహారం అందించారు. సవ్యంగా సాగుతున్న ఈ పథకం. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఆగమేఘాలపై చంద్రన్న బీమా మార్చి వదిలేశారు. దీంతో సహజ మరణంతో పాటు ప్రమాదవశాత్తూ మరణించిన కుటుంబాలు గత పదినెలలుగా పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. అసలు బీమా పథకం ఇస్తారా? లేక ఎత్తేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దెందులూరు నియోజకవర్గంలో మొత్తం రేషన్‌కార్డులు 1,84,770 ఉన్నాయి. వీరంతా దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్నావారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన వారంతా బీమా పథకానికి అర్హులు. ప్రమాదవశాత్తూ ఏదో ఒక రూపంగా మృత్యువు నిత్యం కబళిస్తూనే ఉంది. అయితే ఆదుకోవాల్సిన బీమా పథకం అమలు చేస్తారో? లేదో తెలియడం లేదు.

రూ.10 లక్షలు ఇస్తామన్నారు

బీమా పథకాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తాం..అర్హులందరికీ న్యాయం చేస్తాం. వైఎస్సార్ సీపీ హయాంలో కంటే రెట్టింపు సాయం అందిస్తాం ..సహజ మరణానికైతే రూ.5లక్షలు, ప్రమాదశాత్తూ మరణిస్తే రూ.10లక్షలు ఇస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికలప్పుడు ఊరూరా ఊదరగొట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ ముద్రించి ఇంటింటా పంపిణీ చేశారు. అధికారం చేపట్టాక వక్రబుద్ధి చూపుతున్నారు. 2024మే 13 నుంచి బీమా పథకాన్ని వెబ్‌సైట్ నుంచి తొలగించారు. తర్వాత నమోదుకు అవకాశం కల్పించలేదు. అప్పటి నుంచి ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలైనా సీఎం రిలీఫ్ ఫండ్ కోసం వేచి చూడాల్సి వస్తోంది.



పరిహారం అందించాలి



ఆపద సమయాల్లో పేద కుటుంబాల్లో వెలుగులు నింపే బీమా పథకాన్ని కూటమి సర్కారు వెంటనే అమలులోకి తీసుకురావాలి. వైఎస్సార్ సీపీ హయాంలో బీమా పథకం ఎన్నో కుటుంబాలను ఆదుకుంది. సీఎం చంద్రబాబు దీనిపై నిర్లక్ష్యం చూపకుండా త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయాలి. వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకురావాలి.

– అప్పన ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్, దెందులూరు

మార్గదర్శకాలు రావాలి



సాధారణ, ప్రమాదశాత్తూ మరణాలు ఏవి జరిగినా గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదవుతున్నాయి. అయితే ప్రభుత్వం నుంచి బీమా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడలేదు. స్పష్టమైన మార్గదర్శకాలు అమలులోకి రాగానే పెండింగ్ కలైమ్‌లతో పాటు కొత్త వాటికి న్యాయం జరిగేలా చూస్తాం. ప్రస్తుతం పీఎం బేజేబీవై, పీఎమ్ ఎస్‌బీవై పథకాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

– విజయరాజు, డీఆర్‌డీఏ పీడీ, ఏలూరు జిల్లా

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

భీమడోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే ఎ.కొండూరు మండలం జీలగుంట గ్రామానికి చెందిన ధరావత్తు దుర్గమ్మ(62) అనే వృద్ధురాలు ఈ నెల 4న ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. అదే రోజు రాత్రి తనకు వరసకు కుమారుడు అయిన రమావత్తు శివ బండిపై పంగిడిగూడెం నుంచి పోతునూరుకు వెళ్తుంది. ఈ క్రమంలో మార్గమధ్యంలోని పోలసానిపల్లి హైవే రోడ్డు పక్కనే ఉన్న ధాన్యం రాసులను గమనించకుండా బైక్ ఎక్కించడంతో ఒక్కసారి బైక్ ప్రమాదవశాత్తు అదుపు తప్పింది. దీనితో వృద్ధురాలు దుర్గమ్మకు తీవ్ర గాయాలు కాగా, శివకు స్వల్ప గాయాలయ్యాయి. ఏలూరులో ఇద్దరికి చికిత్స అందించారు. దుర్గమ్మ పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వృద్ధురాలు మృతి చెందింది. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జేసీ ధాత్రిరెడ్డి

దెందులూరు: రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వ్యవసాయ శాఖ పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పర్యవేక్షణ చేయాలన్నారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా గోనె సంచులు సరఫరా జరిగిందన్నారు. బుధవారం పోతునూరు, ఉండ్రాజవరం, కొవ్వలి గ్రామాల్లో కూటమి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. పోతునూరు బస్టాండ్ ఆవరణలో 200 రైతులకు చిన్న ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఉండ్రాజవరంలో సీసీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పోతునూరు సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొవ్వలి లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ ను ప్రారంభోత్సవం చేశారు. కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, దెందులూరు మండలం అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), బొప్పన సుధాకర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, తహసీల్దార్ బీ.సుమతి, ఎంపీడీఓ కే శ్రీదేవి, నాయకులు మోత్కూరి నాని, బొడ్డేటి మోహన్, గారపాటి కొండయ్య చౌదరి, నున్నా లక్ష్మణ్ మూడు గ్రామాల కూటమి నాయకులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

గణపవరం: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి గీతాబాయి అన్నారు. బుధవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి గదులు, ఫార్మసీ ల్యాబ్, వార్డులు పరిశీలించారు. ఆరోగ్యకేంద్రం పనితీరు,రికార్డుల నిర్వహణ తీరును వైద్యాధికారి సంతోష్‌రెడ్డి డీఎం అండ్‌హెచ్ఓకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వే పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఈసర్వే ఎలా జరుగుతుంది? అనే విషయాలను ఆరా తీశారు. ప్రతి నెలా పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని, ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ కార్నర్స్‌ను నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీలో ప్రతి రోజూ ఓఆర్ఎస్ ద్రావణం కలిపి సిద్ధంగా ఉంచాలని, ఆస్పత్రికి వచ్చే రోగుల్లో అవసరమైన వారికి ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆమె రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు.



పిప్పర పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాబాయి

అగ్నిప్రమాదాల్లో తాటాకిళ్లు దగ్ధం

ద్వారకాతిరుమల: మండలంలోని వేంపాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. పెండ్లి నాగేశ్వరరావు, అతని కుమారుడు రాంబాబు కుటుంబాలు రోజులానే పొలం పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి తమ ఇళ్లు దగ్ధమవుతూ కనిపించాయి. వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపుచేశారు. వీఆర్వో నాగేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుల నుంచి వవరాలను సేకరించారు.



ద్వారకాతిరుమల : వేంపాడులో దగ్ధమైన ఇళ్లు

యర్రంపేటలో..

కొయ్యలగూడెం: మండలంలోని యర్రంపేట గ్రామంలో మంగళవారం రాత్రి గ్యాస్ బండ లీకవడంతో మంగమూరు నాగేశ్వరరావు, పెద్దిరాజు అనే ఇరు కుటుంబాలు రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమయ్యాయి. ఇంట్లోని సామగ్రి, రూ.30 నగదు అగ్నికి ఆహుతైందని బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంపై రెవెన్యూ అధికారులు ప్రాథమిక దర్యాప్తు చేశారు.



కొయ్యలగూడెం : యర్రంపేటలో దగ్ధమైన ఇల్లు

క్రీస్తు బోధనలను అనుసరించాలి



బ్రదర్ జాన్‌వెస్లీని సన్మానిస్తున్న సంఘ పెద్దలు

దెందులూరు: దేవునికి లోబడి జీవిస్తూ దేవుని దీవెనలు పొందాలని హోసన్నా మినిస్ట్రీస్ సువార్తికులు బ్రదర్ జాన్ వెస్లీ అన్నారు. నమ్ముట నీ వలన సాధ్యమైతే సమస్తం సాధ్యమేనని సెలవు ఇచ్చిన ఏసుక్రీస్తు బోధనలను అనుసరించాలన్నారు. ప్రతి ఒక్కరు పొరుగువారిని ప్రేమించాలని, మీసేవా గుణం జీవన విధానం పలువురికి ఆదర్శవంతంగా ఉండాలన్నారు. బుధవారం దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో మన్నా చర్చి పాస్టర్ బెంజిమెన్ సంఘస్తులు సంఘ పెద్దలు యువత సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసుక్రీస్తు సువార్త మహాసభలకు ముఖ్యఅతిథిగా బ్రదర్ జాన్ వెస్లీ విచ్చేశారు. తొలిసారిగా మహాసభలకు విచ్చేసిన జాన్ వెస్లీకి దెందులూరు మండల పాస్టర్ల సంఘం అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పాస్టర్ విలియం, పాస్టర్లు మన్నా చర్చి సభ్యులు ఘన స్వాగతం పలికారు. గీతాల పనులు అద్భుత సాక్షాలు ఇచ్చారు. దెందులూరులో జరుగుతున్న ఏసుక్రీస్తు సువార్త మహాసభలకు ఇతర మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

చివరిలో రైతుల్లో గుబులు



కోతకు సిద్ధంగా ఉన్న దాళ్వా వైరు



ధాన్యం రాశిపై బరకాలు కప్పుతున్న రైతులు



గ్రామాల్లో సిద్ధంగా ఉన్న వరికోత యంత్రాలు

వారం రోజులుగా సాయంత్ర సమయంలో ఆకాశంలో మబ్బులు

గణపవరం: దాళ్వా పంట చేతికొచ్చింది. చాలాచోట్ల ఇప్పటికే వరికోతలు ప్రారంభమయ్యాయి. మండలంలో సుమారు 20 శాతం దాళ్వా కోతలు పూర్తయ్యాయి. ముఖ్యంగా తేమశాతం తగ్గించడానికి రైతులు రోడ్లవెంబడి ధాన్యం ఆరబెడుతున్నారు. మరో వారం రోజుల్లో గ్రామాలలో దాళ్వా కోతలు ముమ్మరంగా జరిగే అవకాశం ఉంది. ఈ స్థితిలో వాతావరణం రైతుల గుండెల్లో గుబులు రేపుతుంది. రోజంతా విపరీతమైన ఎండలు కాసి త్రిస్తుండగా, సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై వర్షం జల్లులు, ఈదురుగాలులతో రైతులు బెంబేలెత్తి పోతున్నారు. వారం రోజులుగా సాయంత్రం అయ్యేసరికి ఇదే పరిస్థితి. ఈ దాళ్వాలో పెట్టుబడులు పెరిగినా దాళ్వాపై రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. సాగునీటి కొరత, తెగుళ్లు, దోమపోటు వంటి అవరోధాలను అధిగమించి పంటను అందుకోవడానికి రైతులు ఎదురు చూస్తున్న తరుణంలో వాతావరణం వారిని బెంబేలెత్తిస్తుంది.

25 వేల హెక్టార్లలో సాగు

నియోజకవర్గంలో దాదాపు 25వేల హెక్టార్ల విస్తీర్ణంలో దాళ్వా సాగు చేశారు. మెట్టప్రాంతాలైన ఉంగుటూరు, భీమడోలు మండలాలలోని గ్రామాల్లో దాళ్వా కోతలు ముమ్మరంగా సాగుతుండగా, డెల్టా ప్రాంతమైన గణపవరం, నిడమర్రు మండలాలలో ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభించారు. గణపవరం మండలంలో 6150 హెక్టార్ల విస్తీర్ణంలో దాళ్వా వరిసాగు చేశారు. ఇప్పటికి 10 శాతం రైతులు కోతలు పూర్తిచేశారు. చిలకంపాడు, కాశిపాడు, వాకపల్లి తదితర గ్రామాలలో వరికోతలు ముమ్మరంగా సాగుతుండగా మిగిలిన గ్రామాల రైతులు ఈ వారంలో వరి కోతలు కోయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో వరికోత యంత్రాలు సిద్ధంగా ఉన్నాయి. కొల్లేరు ప్రాంతమైన నిడమర్రు మండలంలో మరో పది రోజుల్లో వరికోతలు ప్రారంభమవుతాయని చెబుతున్నారు. వరికోతలు పూర్తిచేసిన రైతులు తమ ధాన్యం రోడ్లు, పుంతల్లో ఆరబెడుతూ తేమశాతం తగ్గించడానికి పాటుపడుతున్నారు. పూర్తి ఆరుదల ధాన్యం ఎకరాకు 50 నుంచి 55 బస్తాలు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.30 వేలకు చేరింది. అయినా దిగుబడి బాగుందనుకుంటే రోజూ వాతావరణంలో మార్పులు రైతులను కలవరపెడుతుంది. పది రోజులపాటు వాతావరణం అనుకూలిస్తే మొత్తం రైతులంతా గట్టెక్కుతామని రైతులు దేవునిపై భారంవేసి దాళ్వా కోతలకు ఉపక్రమిస్తున్నారు.

దాళ్వా సాగు ఇలా

మండలం	సాగు చేసిన విస్తీర్ణం
గణపవరం	6,150 హెక్టార్లు
భీమడోలు	6,300 హెక్టార్లు
నిడమర్రు	4,600 హెక్టార్లు
ఉంగుటూరు	9,100 హెక్టార్లు

దిగుబడి వచ్చినా భయం.. భయం



దాళ్వా సాగు ఆశాజనకంగా సాగి మంచి దిగుబడి వచ్చింది. అయితే కోతలు ప్రారంభించే సమయంలో వాతావరణం మబ్బులు, వర్షం జల్లులతో ఆందోళన చెందుతున్నాను. నేను 9 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ఎకరాకు పెట్టుబడి పెరిగినా దిగుబడి బాగుందని ఆనందంగా మసూళ్ల ప్రారంభించాం. ఈ పరిస్థితుల్లో కనీసం పదిరోజులపాటు వాతావరణం కష్టాల నుంచి గట్టెక్కుతాం.

– తోపు చంద్రరావు, కౌలురైతు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు

ఉంగుటూరు: అకాల వర్షాలు వలన కళ్లాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, సీనియర్ నాయకుడు గుత్తికొండ కృష్ణారావు కోరారు. బుధవారం మండలంలోని కైకరంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ అకాల వర్షాలు వలన ధాన్యం తడిచి ఆరబెట్టడానికి బరకాలకు అదనపు ఖర్చులు అవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సేవాకేంద్రాలు ద్వారా వెంటనే గోనె సంచులు అందించి కళ్లాల్లో ధాన్యాన్ని వేంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, జి.శ్రీరామమూర్తి, జి.సూర్యారావు, శానం వీరరాఘవులు పాల్గొన్నారు.


ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలి



శిక్షణ పొందిన క్లాప్ మిత్రలు, హరిత రాయబారులతో అధికారులు

భీమడోలు: గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో క్లాప్ మిత్రలు, హరిత రాయబారుల పాత్ర కీలకమని డీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ జి.ప్రసంగిరాజు అన్నారు. భీమడోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద బుధవారం భీమడోలు, దెందులూరు మండలాల క్లాప్ మిత్రలు, హరిత రాయబారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓఆర్డీ ఎ.సుందరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా కోఆర్డినేటర్ జి.ప్రసంగిరాజు, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడుతూ గ్రామాల్లోని సేకరించిన తడి, పొడి చెత్తలను డంపింగ్ యార్డులకు తరలించి వాటి నుంచి వర్మి కంపోస్ట్‌ను తయారీ చేయాలన్నారు. ప్రతి గురువారం వాటిని అమ్మగా వచ్చిన సొమ్మును పంచాయతీల్లో అభివృద్ధికి వినియోగించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎం.వెంకట్రావు, టి.ముత్తయ్య, కేవీఎల్ తనూజ, భూషణం తదితరులు వారికి శిక్షణ అందించారు.

అన్నదాతకు తుఫాన్ నష్టం



నేలకు ఒరిగిన మొక్కజొన్న పంట

కొయ్యలగూడెం: తుఫాన్ ప్రభావిత పంట నష్టంపై వివరాలు సేకరిస్తున్నట్టు ఏఓ చెన్నకేశవులు బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం సంభవించిన గాలివాన బీభత్సానికి సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలోని మొక్కజొన్న పంట నేలవాలిందని, 35 శాతం పంట నష్టం వాటిల్లిందని అంచనా వేశామని చెప్పారు. బోడిగూడెం గ్రామంలో జక్కు సీతామహాలక్ష్మి అనే రైతుకు చెందిన వర్జీనియా పొగాకు బేరన్‌పై భారీ చింత చెట్టు పడడంతో ధ్వంసమైందన్నారు. రేషన్ కర్రలు క్యూరింగ్ దశలో ఉన్నాయని ప్రమాదం వల్ల రూ.2లక్షల మేర నష్టం సంభవించిందని సర్పంచ్ కడకట్ల గద్దియ్య, ఎంపీటీసీ తేలే శ్రీను తెలిపారు. అదేవిధంగా ఉద్యాన పంటలకు సైతం నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ చెప్పారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ధాన్యం శాంపిల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ అచ్చుత అంబరీష్

ఉంగుటూరు: ధాన్యం తడవకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు ఆర్‌డీఓ అచ్చుత అంబరీష్ అన్నారు. బుధవారం కైకరంలో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. తరువాత సొసైటీ గోడౌన్‌లో గోనె సంచులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ పూర్ణచంద్రప్రసాదు ఉన్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: పోషక విలువలు ఉన్న చిరుధాన్యాల వాడడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని పూళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌కే నూర్జహాన్ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పూళ్ల సెక్టార్ పరిధిలోని వడ్లపట్ల, కురెళ్లగూడెం, పూళ్ల, కోడూరుపాడు, అన్నేవారిగూడెం, దుద్దేపూడి గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులతో కలిసి బుధవారం అవగాహన ర్యాలీలను నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తు నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఝాన్సీ అంగన్‌వాడీ, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.